# కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ కష్టాలే..

- ఆ పార్టీ మాయ మాటలను నమ్మొద్దు
- గిరిజనులకు పోడు పట్టాలు ఇచ్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే
- రుణమాఫీ సంపూర్ణంగా అమలుచేస్తాం.. అనుమానాలు వద్దు..
- వందల కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశా..
- బాల్కొండ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- కమ్మర్‌పల్లి, మోర్తాడ్ మండలాల్లో ఎన్నికల ప్రచారం



మోర్తాడ్ మండలం శెట్‌పల్లిలో మాట్లాడుతున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

కమ్మర్‌పల్లి/ మోర్తాడ్, నవంబర్ 8 : కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ కష్టాలు తప్పవని, ఆ పార్టీ మాయమాటలు నమ్మవద్దని బాల్కొండ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన కమ్మర్‌పల్లి, మోర్తాడ్ మండలాల్లో పర్యటించారు. ఉదయం కమ్మర్‌పల్లి మండలంలోని అమీర్ నగర్, ఇనాయత్ నగర్, నర్సాపూర్, సాయంత్రం మోర్తాడ్ మండలం శెట్‌పల్లి, ధర్మోరా, దోన్కల్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంత్రికి ఆయా గ్రామాల్లో నీరాజనం పలికారు. బోనాలు, వలగొడుగులు, నృత్యాలు చేస్తూ ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారంలో వేముల మాట్లాడుతూ.. గిరిజనులకు పోడు పట్టాలను అందించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. బీఆర్ఎస్‌ను మరోసారి ఆశీర్వదించి గెలిపిస్తే ఐదేండ్లలో పింఛన్ రూ.5 వేలకు, రైతుబంధు రూ.16 వేలకు పెంచుతామన్నారు. కర్ణాటకలో పది గంటల కరెంటు ఇస్తామన్న హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. గెలిచాక 5 గంటలు కూడా సరిగ్గా ఇవ్వలేకపోతున్నదని తెలిపారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే తెలంగాణలో మళ్లీ రైతులు రాత్రి పూట తోట కాడ నిద్ర పోయే రోజులు వస్తాయని గుర్తుచేశారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా కేసీఆర్ ప్రభుత్వం రైతులకు విద్యుత్ సమస్యలను దూరం చేసిందన్నారు. వ్యవసాయానికి పెద్దపీట వేస్తూ 24 గంటలు ఉచిత విద్యుత్ అందిస్తున్న కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. మన రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో లేవన్నారు. కావాలంటే ఆ పార్టీలకు చెందిన సోదరులు కర్ణాటక, మహారాష్ట్రకు వెళ్లి చూసి రావాలని సూచించారు. కావాలంటే కారు, దారి ఖర్చులు తానే భరిస్తానని చెప్పారు. చూసి వచ్చిన వారు అంబేద్కర్ విగ్రహాల వద్ద వాస్తవాలు తెలుపాలని సూచించారు.

**చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఏకమైండ్రు..**

తెలంగాణలో ఎన్నికలు వచ్చాయంటే చాలు ఆంధ్రనాయకులంతా ఏకమైతారని, ఏవో కుట్రలు పన్నుతారని ఆరోపించారు. ఎవరేకమైనా సరే కేసీఆర్ వెంట్రుక కూడా పీకలేరని స్పష్టం చేశారు. ఎవరెన్ని చెప్పినా తెలంగాణ ప్రజలు మోసపోయే స్థితిలో లేరని అన్నారు. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చంద్రబాబు శిష్యుడని తెలిపారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఏకమై తెలంగాణను ఆగం చేయాలని చూస్తున్నారని, ఎవరూ ఆగం కావద్దని సూచించారు. ఎన్ని కుట్రలు చేసినా తెలంగాణ బిడ్డలు తిప్పికొడుతారన్నారు. రుణ మాఫీ సంపూర్ణంగా అమలవుతుందని.. అనుమానాలు అవసరం లేదని స్పష్టం చేశారు. రూ.19 వేల కోట్లలో ఇప్పటికే రూ.13 వేల కోట్ల రుణ మాఫీ జరిగిపోయిందన్నారు. మిగతాది కూడా ఆగే ప్రసక్తే లేదని, రైతులు ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా పింఛన్ రూ.5 వేలకు, రైతు బంధు రూ.16 వేలకు పెరుగక పోతే వచ్చే ఎన్నికల్లో తనను గ్రామాల్లోకి రానీయకండని అన్నారు. నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టానని, తన కన్నా ముందు పని చేసిన వారు ఇలా అభివృద్ధి ఎందుకు చేయలేకపోయారో ఆలోచించాలని కోరారు. అమీర్ నగర్ సర్పంచ్ తండా–అమీర్‌నగర్ మధ్య గట్టుపొడిచిన వాగు కాలువ పై తాను వచ్చాకే వంతెన మంజూరైనట్లు తెలిపారు. నర్సాపూర్‌లో ప్రచారం కొనసాగుతుండగా వర్షం కురవగా.. మంత్రి ప్రసంగాన్ని గ్రామస్తులు వానలోనే నిలబడి విన్నారు. శెట్‌పల్లి, ధర్మోరా, దొన్కల్ గ్రామాల్లో మంత్రి ప్రశాంత్‌రెడ్డి గజమాలతో సన్మానించి, బోనాలు, వలగొడుగులతో ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమాల్లో డాక్టర్ మధుశేఖర్, ఎంపీపీ శివలింగు శ్రీనివాస్, జడ్పీటీసీ బద్దంరవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెడ ఏలియా, సర్పంచులు బద్దంగంగారెడ్డి, మండల రాజేశ్వర్, కత్తిలావణ్యముత్తెన్న, ఎంపీటీసీలు అశోక్, శ్రీనివాస్, లావణ్యా సుధాకర్, నవీన్, దుగ్గెన రాజేందర్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లి మండలం ఇనాయత్‌నగర్‌లో దివ్యాంగురాలితో ఆప్యాయంగా మాట్లాడుతున్న వేముల



బొట్టుపెట్టి మంత్రి వేములకు స్వాగతం పలుకున్న మహిళ

## వేముల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు



గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వేముల

వేల్పూర్, నవంబర్ 8 : మండలంలోని లక్కోరా మాజీ ఎంపీటీసీ గోవర్ధన్‌గౌడ్, బైరి సుధాకర్, అమీనాపూర్ శ్రీనివాస్, కార్యకర్తలు (బీజేపీ), జాన్కంపేట్ గ్రామం కాంగ్రెస్ నుంచి అనంతరావు, సంతోష్, ప్రిన్స్, వంశీ, కార్యకర్తలు, మోర్తాడ్ మండలం సుంకెట్ గ్రామం బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పిట్ల బాలకిషన్, పిట్ల గణేశ్, దొన్కంటి దినేశ్, భీమ్‌గల్ మండల కేంద్రానికి చెందిన గొల్ల మహేశ్, కార్యకర్తలు బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మంత్రి వేముల గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

# బీఆర్ఎస్ ముమ్మర ప్రచారం



ఏర్గట్లలో ఇంటింటా ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఏర్గట్ల, నవంబర్ 8: మండలంలోని ఎనిమిది గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. పార్టీ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిస్తున్నారు. బుధవారం ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి, జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, విండో చైర్మన్ బర్మ చిన్న నర్సయ్య పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి వేములను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు తుపాకుల శ్రీనివాస్ గౌడ్, నాయకులు బద్దం ప్రభాకర్, లక్కం నర్సయ్య, ఇరపట్నం గం గారాం, శ్రీనివాస్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

**కారుకే మా ఓటు..**

**రెంజర్ల యాదవ సంఘ తీర్మానం**

ముప్కాల్, నవంబర్ 8: మండలంలోని రెంజర్ల గ్రామానికి చెందిన యాదవ సంఘ సభ్యులు కారు గుర్తుకే ఓటేస్తామని బుధవారం తీర్మానించుకొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యాదవుల అభివృద్ధికి సీఎం కేసీఆర్,మంత్రి వేముల ఎంతో కృషి చేశారని తెలిపారు. ఎవరెన్నీ మాటలు చెప్పినా తాము మాత్రం వేముల ప్రశాంత్‌రెడ్డి వెంటే ఉంటామని స్పష్టం చేశారు. సమావేశంలో సర్పంచ్ ఆకుల రాజారెడ్డి, యాదవ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

**భారీ మెజార్టీ కోసం సైనికుల్లా పని చేస్తాం**

మెండోరా, నవంబర్ 8: బాల్కొండ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు సైనికుల్లా పని చేస్తామని పోచంపాడ్ గ్రామానికి చెందిన కింగ్స్ యూత్ క్లబ్ సభ్యులు అన్నారు. బుధవారం పోచంపాడ్ గ్రామంలో పలు యూత్ సంఘ సభ్యులతో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి సమావేశమయ్యారు. అనంతరం బుస్సాపూర్‌లో పార్టీ కార్యాలయంలో పలు సంఘాలతో విడివిడిగా మాట్లాడారు. పార్టీకి భారీ మెజార్టీ వచ్చే దిశగా పని చేయాలని, అప్పుడే మరింత అభివృద్ధి జరిగి నిధులు వస్తాయన్నారు. సమావేశాల్లో సర్పంచ్ మిస్బా, ఉపసర్పంచ్ సతీశ్, బీఆర్ఎస్ నాయకులు ఎస్‌కె.పాషా, ప్రమోద్, అనిల్, కె.రాజు, సాయారెడ్డి, కింగ్స్ యూత్ సభ్యులు, గంగపుత్ర సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**అభివృద్ధి చేసిన వేములను ఆశీర్వదించండి**

మోర్తాడ్, నవంబర్ 8: మండలంలోని అన్ని గ్రామాల్లో వేముల ప్రశాంత్‌రెడ్డి తరపున బీఆర్ఎస్ నాయకులు ప్రచారాన్ని ముమ్మురం చేశారు. ఇప్పటి వరకు ఏ నాయకుడు చేయని అభివృద్ధి చేసిన వేములను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈసారి పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలకు అమలయ్యే మ్యానిఫెస్టో గురించి వివరించి, బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు.



రెంజర్లలో బీఆర్ఎస్ కు మద్దతుగా నినాదాలు చేస్తున్నయాదవ సంఘ సభ్యులు



బుస్సాపూర్‌లో పలు సంఘాల వారీగా నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న పోచంపాడ్ గంగపుత్ర సంఘం సభ్యులు

## 'ఓట్ ఫర్ ఇండియా'




మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఓటుహక్కు వినియోగంపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు 'ఓట్‌ఫర్ ఇండియా' ఆకృతిలో నిలబడి ఓట్‌ఫర్ ఇండి యా అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చిట్యా ల నర్సయ్య, సిబ్బంది పాల్గొన్నారు.
–భీమ్‌గల్, నవంబర్ 8

## మొబైల్ అప్పగింత

బాల్కొండ, నవంబర్ 8 : మండలంలోని నాగపూర్ గ్రామానికి చెందిన మహిపాల్‌రెడ్డి నెల క్రితం తన మొబైల్ పోగొట్టుకున్నాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్‌ను గుర్తించారు. ఈ మేరకు బాధితుడికి మొబైల్‌ను బుధవారం అందజేసినట్లు ఏఎస్సై శంకర్ తెలిపారు.

## తగ్గుతున్న ఎస్సారెస్పీ నీటిమట్టం

మెండోరా, నవంబర్ 8 : కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతుండడంతో ఎస్సారెస్పీలో నీటిమట్టం క్రమంగా తగ్గుతున్నదని ప్రాజెక్టు ఏఈఈ రవి తెలిపారు. కాకతీయ కాలువకు 250, సరస్వతీ కాలువకు 500, మిషన్ భగీరథ తాగునీటి అవసరాల కోసం 152 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సీజన్‌లో ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుంచి 200.362 టీఎంసీల వరద వచ్చి చేరిందన్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1091.00 అడుగులు (90.313 టీఎంసీలు) కాగా బుధవారం సాయంత్రానికి 1089.20 అడుగుల (80.658 టీఎంసీలు) వద్ద ఉన్నదని తెలిపారు.